పాపాన్ని నేను నీకెందుకివ్వాలి? ఇవిగో. వీటిని నా అంతట నేనే ఇస్తున్నాను. పట్టుకెళ్ళు."

ఆయన ఆ బంగారు పెట్టెని ఆ రౌడి చేతిలో పెట్టాడు. రౌడి ఆ పెట్టెని తీసుకోలేదు.

"మీ బోధ నా తలకెక్కింది. నేనింక ఎలాంటి పాపం చేయను." ఆ సద్గురువుతో స్థిరంగా చెప్పాడా రౌడి.

## 44.(అ) శాంతి

అర్ధరాత్రి అయినా నిద్ర పట్టని ఓ ధనవంతుడు తన ఇంటి డాబా మీదకి వెళ్ళి నక్షత్రాలని, చంద్రుడిని చూస్తూండగా,ఆయన దృష్టి పక్కనున్న స్థలంలోని పాక మీద పడింది. రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితిలో ఉన్న ఓ రోజు కూలి ఆ పాకలో గుర్రుపెట్టి నిద్రపోతూ కనిపించాడు.

చింకిచాప మీద, తలకింద చేతిని వుంచుకుని పడుకున్న అతను రేపెలా గడుస్తుందన్న ఆలోచన లేక హాయిగా, నిశ్చింతగా ఎలా నిద్ర పోగలుగుతున్నాడు? ఆ సంగతి మర్నాడు ఆయన తన ఆధ్యాతిక గురువుకి చెప్పాడు.

తన శిష్యుడికి మంచి ఆధ్యాత్మిక పాఠం చెప్పడానికి అది చక్కటి అవకాశంగా భావించిన ఆ గురువు చెప్పాడు.

"నీ ప్రశ్నకి సరైన సమాధానం చెప్తా కాని, నువ్వు అతనికి ఓ బస్తా బియ్యం, ఇతర వంట సామగ్రి కోసం ఓ వెయ్యి రూపాయలు వెంటనే పంపు. ఈ రాత్రికి ఏమవుతుందో చూడు."

ఆ ప్రకారం ధనవంతుడు వెంటనే వాటిని ఆ పేదవాడి ఇంటికి పంపాడు. ఆ రాత్రి కూడా నిద్రపట్టని ఆ ధనవంతుడు తన ఇంటి డాబా మీద పచార్లు చేస్తూంటే, పాకలోని పేదవాడు కూడా నిద్ర పట్టక పక్కమీద దొర్లుతూ కనిపించాడు.

మర్నాడు ఉదయం అతన్ని పిలిపించి అడిగాడా ధనవంతుడు.

"నిన్న రాత్రి నీకు బాగా నిద్ర పట్టిందా?"

"లేదండి." జవాబు చెప్పాడు వాడు.

"ఎందుకని?" ప్రశ్నించాడు.

"నా గుడిసెకి తెర తప్ప తలుపు లేదు. దాంతో మీరిచ్చిన సామగ్రి, డబ్బు ఎవరయినా ఎత్తుకెళ్తారన్న భయంతో నిద్ర పట్టలేదు."

మనిషికి శాంతి, తద్వారా నిద్ర ఎందుకు కరువవుతాయో వెంటనే అర్థమైంది. 'నాది' అనుకునే భౌతిక సంపద పెరిగే కొద్దీ, దాన్ని కాపాడుకోవాలనే తాపత్రయం పెరిగి ఎన్ని విధాల మనిషి సతమతమౌతూ శాంతికి దూరం అవుతాడో ఆ ధనవంతుడికి అర్థమయింది.

జరిగింది ఆ ధనవంతుడు తన గురువుకి చెప్పాడు. ఆయన తన శిష్యుడితో చెప్పాడు.

"ఈ ప్రపంచంలోని అన్ని వస్తువులు, అన్ని సంపదలు కేవలం ఆ భగవంతుడికి చెందినవే తప్ప ఏదీ మనది కాదు. ఒకప్పుడు ధనం తనది అనుకున్న మనిషి నేడు లేడు. నేడు ఆ ధనం నాది అనుకునే మనిషి ఏదో ఓ రోజున మరణించి తీరుతాడు. ఎప్పటికీ ఉండేది ఒక్క ఆ భగవంతుడే కనుక అన్నీ ఆయనకే చెందుతాయి. ఈశావాస్యోపనిషత్తు బోధించేది సరిగ్గా ఇదే. అందుచేత మన శరీరపోషణకి మించిన సంపాదన మనని అశాంతికి గురి చేస్తుంది తప్ప శాంతిని, సంతోషాన్ని ఇవ్వలేదు. అందుకనే మనం కనీస అవసరాలతో జీవించడం నేర్చుకోవాలని మహాత్ములు చెప్తుంటారు."

## 45. మంచి-చెడు

ఓ సారి శివుడు, పార్వతి మానవ రూపాల్లో భూలోక సంచారం చేస్తున్నారు. ఓ ధనవంతుడి ఇంట్లో వారు ఓ రాత్రి బస కోరారు. అందుకు ఇష్టపడని ఆ ధనవంతుడు అనేక సార్లు బ్రతిమాలించుకుని, అయిష్టంగానే